క్లుప్తంగా

మోడల్ స్కూల్ సందర్శన



ఉపాధ్యాయులతో అదనపు సంచాలకులు శ్రీనివాసచారి, డీఈవో యాదయ్య

మందమర్రిరూరల్: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా విద్యాధికారి యాదయ్యతో కలిసి రాష్ట్ర విద్యాశాఖ అదనపు సంచాలకులు శ్రీనివాసచారి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో దత్తుమూర్తి, స్కూల్ ప్రిన్సిపాల్ సారా తస్నీమ్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

దండేపల్లి: అటవీహక్కుల చట్టాన్ని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్‌చేశారు. దండేపల్లి మండలం కోయపోచగూడలో మంగళవారం సీపీఎం మండల ప్రథమ మహాసభను నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. పోరాటాలతోనే పేదలు భూములు సా.,దించుకున్నారని గుర్తుచేశారు. పాలకులు పేదల సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. 2006అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఆదివాసీ పేదలపై నిర్బంధాలు ప్రయోగిస్తే తీవ్రమైన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పార్టీ మండల నూతన కమిటీనీ ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అశోక్, మండల నాయకులు రమేష్, ఎల్లయ్య, లింగన్న, బుచ్చన్న, రాజలింగు, మహేశ్వరి, సునీత, పోషం, రాజం, రాజేశ్వరి పాల్గొన్నారు.

'పండుగకైనా వేతనాలు చెల్లించరా..?'

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి దసరా పండుగకైన వేతనాలు చెల్లించరా అని సీ ఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ ప్రశ్నించారు. యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏరియా ఆసుపత్రి ఎదుట వర్కర్లు నిరసన తెలిపారు. గడిచిన ఐదు నెలల నుంచి వర్కర్లకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చల్లూరి దేవదాస్, సజీవన్, జానకి, రమేశ్, ఏరియా ఆసుపత్రి యూనియన్ అధ్యక్షుడు శేఖర్, కోశాధికారి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

పాతమంచిర్యాల: నాయకపోడ్‌లు హక్కుల కోసం పోరాడాలని ఆదివాసీ నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టులో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో జిల్లాలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నాయకపోడ్‌ల స్థితిగతులను నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు మార్నెని భూమేష్, ప్రధాన కార్యదర్శి భీమిని సంజీవ్, ఉపాధ్యక్షులు ఏదుల మోహన్, జైనేని కొమురయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బైరనేని అశోక్, సలహాదారులు తోట రాజు, గడ్డం రమేష్ పాల్గొన్నారు.

సాహసం చేసి.. విద్యుత్ సరఫరా పునరుద్ధరించి



స్తంభం వద్దకు వెళ్తున్న విద్యుత్ సిబ్బంది

నెన్నెల: వీచిన గాలి వానకు మంగళవారం మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలోకి వెళ్లే మెయిన్ విద్యుత్ వైర్లు తెగి గోపాల్ చెరువులో పడిపోయాయి. విషయం తెలుసుకున్న లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజన్న సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌సరఫరా నిలిపివేసి చెరువులోకి ట్రాక్టర్ ట్యూబ్, తాడు సాయంతో వెళ్లి మరమ్మతు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

మూలనపడ్డ చెత్త వాహనాలు



చెన్నూర్: మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ కోసం గత ప్రభుత్వ హయాంలో 16 చెత్త వాహనాలు, రెండు ట్రాక్టర్లు, ఒక టాటాఎస్ మొత్తం 19వాహనాలను కొనుగోలు చేశారు. ఈ ఏడాది 8 వాహనాలు చెడిపోయాయి. ప్రస్తుతం 8 చెత్త వాహనాలు, రెండు ట్రాక్టర్లను చెత్త నిర్వహణకు వినియోగిస్తున్నారు. గతంలో వార్డుకు ఒక్క వాహనం ద్వారా చెత్త సేకరణ చేయడంతో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా సాగింది. ప్రస్తుతం పది వాహనాలే చెత్త నిర్వహణకు వినియోగిస్తుండడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మూలనపడ్డ వాహనాలు కార్యాలయంలో తుప్పు పట్టి పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మురుగు నీరు తొలగించరూ..!



భీమారం: మండలంలోని తాళ్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మురుగు నీరు నిలిచి అధ్వానంగా ఉంది. నీటిని తొలగించడంలో గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. రోడ్డు కన్నా పాఠశాల కిందకు ఉండటంతో వరద నీటితో పాటు మురుగు నీరు వెళ్లే దారిలేక పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వ్యాప్తిస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకొని, నీటిని తొలగించాలని వారు కోరుతున్నారు.

వెలగని వీధి లైట్లు.. ఇబ్బందుల్లో వాహనదారులు

నస్పూర్: పట్టణ పరిధి షిర్కేలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి రాయల్‌గార్డెన్ చౌరస్తా వద్దకు గల రోడ్డులోని సెంట్రల్ లైటింగ్‌లో వీధిలైట్లు కొద్ది నెలలుగా వెలగడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జున, షిర్కే, నస్పూర్, తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీల నుంచి సింగరేణి కార్మికులు శ్రీరాంపూర్‌లో గల ఎస్ఆర్పీ 1, ఎస్ఆర్పీ 3, వర్క్‌షాప్, స్టోర్స్, జీఎం కార్యాలయంలో విధులు నిర్వహించడానికి నిత్యం ఈ దారి గుండానే రాకపోకలు కొనసాగిస్తుంటారు. అదే విధంగా ప్రతీ శని, మంగళవారాలు రాయల్ గార్డెన్ వద్ద ఖాళీ స్థలంలో రోడ్డుపై వారసంత నిర్వహిస్తుంటారు. సెంట్రల్ లైటింగ్‌లో వీధిలైట్లు వెలగకపోవడంతో రోడ్డు మొత్తం చీకటిగా ఉంటుంది. దీంతో ఉద్యోగులు, వారసంతకు వచ్చే కొనుగోలుదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



'వసతి' అధ్వానం..!

- అపరిశుభ్రతకు అడ్డాగా మరుగుదొడ్లు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత..
- పట్టించుకోని అధికారులు



అపరిశుభ్రంగా టాయిలెట్లు



బాలుర వసతి గృహం

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ, పీజీ కళాశాలను 2019లో రూ.12కోట్ల నిధులతో నిర్మించారు. దూరం నుంచి వచ్చే విద్యార్థుల కోసం రెండు వేర్వేరుగా బీసీ బాల, బాలికల పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలను నిర్మించారు. డిగ్రీ విద్యార్థులు 672, పీజీ 65, ఇంటిగ్రేటెడ్ బీఈడీ 77మంది విద్యార్థులు కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. బాలుర వసతి గృహంలో 100మంది, బాలికల వసతి గృహంలో 160మంది విద్యార్థులు ఉంటున్నారు.

అన్నీ సమస్యలే...

బాలుర బీసీ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహం అపరిశుభ్రతకు మారుపేరుగా మారింది. సిబ్బంది కొరత వేధిస్తోంది. హాస్టల్లో చెత్త, చెదారం పేరుకుపోయింది. మరుగుదొడ్లు దుర్వాసన జల్లుతున్నాయి. బెడ్స్ కూడా లేకపోవడంతో నేలపైనే పడుకుంటున్నారు. విద్యార్థులు సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. హాస్టల్‌కు బయటి విద్యార్థులు వచ్చి హాస్టల్ విద్యార్థులతో గొడవలకు దిగుతున్నారు. ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా ఇలాంటి ఘటన జరిగి పోలీసుల వరకు వెళ్లింది. సరైన భద్రత, పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇన్‌చార్జి వార్డెన్ శ్రీనివాస్, వాచ్‌మెన్ క్రాంతికుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఈ విషయమై ఇన్‌చార్జి వార్డెన్ విధులు నిర్వహించలేనని రాత పూర్వకంగా ఇచ్చినట్లు తెలిసింది. వసతి గృహంలో కుక్, స్కావెంజర్ కూడా లేరు. ఒక్క కమాటి మాత్రమే విధులు నిర్వహిస్తుండడంతో సమయానికి విద్యార్థులకు భోజనం అందడం లేదు. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని, హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్, సిబ్బందిని నియమించి, విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

స్కావెంజర్ లేకపోవడంతో...



హాస్టల్‌లో స్కావెంజర్, సిబ్బంది పూర్తిగా లేకపోవడంతో చాలా ఇబ్బంది అవుతోంది. పడుకోవడానికి బెడ్స్ లేవు. బాత్‌రూంలు, టాయిలెట్లు పరిశుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వస్తుంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించాలి.

– విజయ్, డిగ్రీ ఫైనల్ ఇయర్, హాస్టల్ విద్యార్థి

సమస్యలు పరిష్కరిస్తాం..

డిగ్రీ కళాశాల పోస్టు మెట్రిక్ వసతి గృహంలో సమస్యలపై చర్యలు తీసుకుంటున్నాం. కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించి సమస్యలు పరిష్కరిస్తాం.

– పురుషోత్తం నాయక్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి

108 వాహనాలు ఆకస్మిక తనిఖీ



తాండూర్: తనిఖీ చేస్తున్న అధికారులు

నెన్నెల/తాండూర్/భీమిని: 108 వాహనాలను హైదరాబాద్ ప్రధాన కార్యాలయ అధికారి కిషోర్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా సూపర్‌వైజర్ సంపత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాండూర్, నెన్నెల, భీమిని మండలాల్లోని అత్యవసర సమయాల్లో వినియోగించే పరికరాల పనితీరును, సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణులు, పాము కాటు వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ 108అంబులెన్స్‌ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో వాహనాల సిబ్బంది అన్నం తిరుపతి, శివకృష్ణ, సారయ్య, రాకేష్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నాయకులను తీసుకెళ్తున్న పోలీసులు

తాండూర్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్వీ నాయకులు ఆందోళన బాటపట్టారు. తాండూర్ మండల కేంద్రంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియెంబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని, తాండూర్ మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో విద్యార్థుల శక్తి ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే నియోజకవర్గవ్యాప్తంగా పెద్ద ఎత్తున దశల వారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ తాండూర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఆడెపు అరుణ్, సీనియర్ నాయకులు క్రిస్టెఫర్, సత్యనారాయణ, చింటూ, బీఆర్ఎస్వీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ అమరవీరులకు నివాళి



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్/దండేపల్లి/తాండూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ నెల 10 నుంచి 17 వరకు జరుగుతున్న వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తాండూర్, మందమర్రి, దండేపల్లి మండలాల్లో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీ జెండా ఎగురవేసి అమరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమాల్లో దండేపల్లిలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి పెర్క రాజేష్, లక్సెట్టిపేట మండల కార్యదర్శి దేవవరం, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, సీపీఎం పార్టీ తాండూర్ మండల కార్యదర్శి దాగం రాజారాం, మందమర్రి సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గరాజ్ నాయకులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

● ఏరియా కబడ్డీ పోటీలు ప్రారంభం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా ఏరియా కబడ్డీ పోటీలను ఎస్వో టు జీఎం విజయప్రసాద్ ప్రారంభించారు. కాసిపేట–1, శాంతిఖని(గ్రూపు–1), కేకే–5, కేకే–ఓసీ, ఆర్కే–ఓసీ, జీఎం ఆఫీస్(గ్రూపు–2), కాసిపేట–2, ఎస్ అండ్ పీసీ, ఆర్కేపీ, మందమర్రి సివిల్ డిపార్ట్‌మెంట్, ఏరియా స్టోర్స్, సీహెచ్‌పీ, (గ్రూపు–3) తలపడగా గ్రూపు–3 జట్టు విన్నర్‌గా, గ్రూపు–1 జట్టు రన్నర్‌గా నిలిచింది. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవాధ్యక్షుడు కార్తీక్, కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీను, యూనియన్ల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

● 'తప్పుడు లెక్కలు చూపడానికే జాప్యం'

శ్రీరాంపూర్: కంపెనీ లాభాల్లో తప్పుడు లెక్కలు చూపెట్టడానికే లాభాలను ప్రకటించకుండా జాప్యం చేస్తున్నారని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి, పొగాకు రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వాస్తవ లాభాలను ప్రకటించి అందులో నుంచి కార్మికులకు 35శాతం వాటా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

● బ్రాంచ్ కమిటీలో పలువురికి చోటు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీలో పలువురికి చోటు కల్పించినట్లు ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ తెలిపారు. ఇందులో బ్రాంచ్ కార్యదర్శులుగా గడ్డం మైపాల్ రెడ్డి, సాధుల భాస్కర్, గొర్ల సంతోష్, వెంగల కుమార్‌స్వామి, మారం ఉత్తేజిరెడ్డి, బుస్సు రమేశ్, తొంగల రమేశ్, జాయింట్ సెక్రెటరీలుగా బిరు దు శ్రీనివాస్, తిరుపతిరావు, గోవిందుల రమేశ్, శ్రీనివాస్ చారి, చంద్రగిరి మల్లేశ్, పానుగంటి విజయ్, క్రాంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బ త్తుల రాజేశం, రామగిరి సంపత్, కొప్పుల రవీందర్, చిప్ప రమేశ్, నరసింహ స్వా మి, మల్లికా ర్జున్, తుమ్మల రాజిరెడ్డి, అనిరుద్, అశోక్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గజ్జల దేవేందర్, జంగా తిరుపతి రెడ్డి, కోశాధికారిగా చిలుకూరి జగదీష్‌లను నియమించినట్లు తెలిపారు.

ఉత్పత్తి లక్ష్యం సాధించాలి



మాట్లాడుతున్న కార్పొరేట్ జీఎం(పీపీ) మనోహర్

శ్రీరాంపూర్: కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కార్పొరేట్ జీఎం(పీపీ), ప్రొడక్షన్ టార్గెట్ కమిటీ కన్వీనర్ మనోహర్ తెలిపారు. టార్గెట్ కమిటీ సభ్యులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏరియా జీఎం శ్రీనివాస్‌తో కలిసి ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 2026–27ఆర్థిక సంవత్సరానికి సాధించాల్సిన ఉత్పత్తి లక్ష్యాల కోసం ముందుగా చేపట్టాల్సిన చర్యలపై ఈ టార్గెట్ కమిటీ విశ్లేషణ చేసింది. బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఓపెన్ కాస్ట్ గనుల జీఎం సూర్యనారాయణ రాజు, భూగర్భ గనుల జీఎం రఘురాం రెడ్డి, ఏరియా ఎస్వోటు జీఎం సత్యనారాయణ, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, ఓసీపీ ప్రాజెక్టు అధికారులు ఏవీ రెడ్డి, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, డీజీఎంలు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా గనుల్లో బ్లాస్టింగ్ కోసం వాడే ఎక్స్‌ప్లోజీవ్ వినియోగం, దాని నిల్వలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజీవ్స్ మన్మీత్ సింగ్ మన్హాస్, మరో అధికారి రామేశ్వర్ భాస్కర్‌లు ఏరియా జీఎం శ్రీనివాస్‌తో ఆయన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఎలక్ట్రికల్ డిటోనేటర్స్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. అంతకు ముందు వారు ఆర్కేపీ పరిధిలోని ఎంకే 4 మ్యాగ్జిన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

నూతన గనులు ప్రారంభించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రాంతంలో నూతన బొగ్గు గనులను ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ అన్నారు. బెల్లంపల్లిలో తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాట వార్షికోత్సవాలను మంగళవారం నిర్వహించారు. రైల్వే స్టేషన్ ఏరియాలో పట్టణ సీపీఐ కార్యదర్శి రాజమౌళి, శాంతిఖని బస్తీ సీనియర్ నాయకుడు పి.స్వామి దాస్ అరుణ పతాకాలను ఆవిష్కరించి అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి బి.తిలక్ అంబేద్కర్, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాంతిఖని గని సందర్శన



గనిలో దిగడానికి సిద్ధమైన జీఎం, అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శాంతిఖని భూ గర్భ గనిని మంగళవారం మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణ సందర్శించారు. జీఎంగా బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణ గనిని సందర్శించి అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉద్పాకత, రక్షణ చర్యల గురించి అధికారులను జీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం గని అధికారులతో కలిసి గనిలో దిగి పనిస్థలాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. జీఎం వెంట గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఇతర అధికారులు, సూపర్ వైజర్లు ఉన్నారు.

'బహిష్కరించడం సరికాదు'

శ్రీరాంపూర్: సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశాన్ని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు బహిష్కరించడం సరికాదని ఐఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు. నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు మాట్లాడారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీని ఎన్నుకున్నారని, ఈ సమస్యల పరిష్కారానికి వేదికైన స్ట్రక్చరల్ సమావేశాలకు పాల్గొనకుండా బహిష్కరించి కార్మికులకు అన్యాయం చేశారన్నారు. కేవలం సీఎండీ సమావేశానికి ఆలస్యంగా వస్తున్నారని సమాచారంతో సమావేశాన్ని బహిష్కరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు, బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● నేడు పీహెచ్‌సీ భవనం ప్రారంభం

భీమారం: మండల కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించనున్నట్లు జైపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

● సేవలు వినియోగించుకోవాలి

లక్సెట్టిపేట: ప్రజలు ప్రభుత్వాసుపత్రి సేవలను వినియోగించుకోవాలని జిల్లా డీసీహెచ్ కోటేశ్వర్ రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు స్రవంతి రావు, గైనకాలజిస్టు శ్రీనివాస్, అనెస్థిషియా పవిత్ర, సిబ్బంది భాగ్య పాల్గొన్నారు.

● రక్తదానానికి ముందుకు రావాలి

మంచిర్యాలటౌన్: ఈ నెల 21న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పుట్టినరోజును పురస్కరించుకొని మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నా యకులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు అత్యవసరమైన సమయాల్లో రక్తాన్ని అందించేందుకు రక్త నిల్వలు సరిపడా లేవన్నారు. కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● రావణ దహనం మానుకోవాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో దసరాను పురస్కరించుకుని నిర్వహిస్తున్న రావణ దహనం కార్యక్రమాన్ని మానుకోవాలని నిర్వాహకులకు దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు సూచించారు. పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రావణాసుర వధను ఆపకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో దళిత సంఘాల అధ్యక్షులు రాజనర్సు, రాజేష్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య ఉన్నారు.

● చిన్నారులపై పర్యవేక్షణ అవసరం

తాండూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధిపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సీడీపీవో స్వరూపారాణి అన్నారు. మండలంలోని కిష్టంపేట రైతువేదికలో తాండూర్, మాదారం, కాసిపేట సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లకు పోషన్ బీ–పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, టీచర్లు పాల్గొన్నారు.

● 'ప్రభుత్వం లబ్ధిదారులకు పింఛన్ పెంచాలి'

తాండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధిదారులకు పింఛన్‌ను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య డిమాండ్ చేశారు. తహసీల్దార్ జ్యోత్స్నకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

● వైద్య శిబిరాలు

జన్నారం/మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో, జన్నారం మండలంలోని సింగరాయి పేటలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

● నేడు చెన్నూర్ సీహెచ్‌సీలో...

చెన్నూర్: చెన్నూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం స్వస్థ నారి శశక్త పరివార్ కార్యక్రమంలో భాగంగా స్త్రీలకు ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు.